ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్
RNI No: APTEL/2023/87888
మంగళవారం
02 డిసెంబర్ 2025






# నాటుకోడి చికెన్..ఇడ్లీ:డీకే నివాసంలో సిద్ధూ బ్రేక్ ఫాస్ట్

**డిసెంబర్ 2, (రిపబ్లిక్ న్యూస్):** కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. తాజాగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. ఇద్దరూ కలిసి బ్రేక్ఫాస్ట్ చేశారు. అల్పాహారంలో నాటుకోడి చికెన్, ఇడ్లీ, ఉప్మా, దోశ, కాఫీ ఆస్వాదిస్తూ ప్రస్తుత పరిణామాలపై చర్చించుకున్నారు. రెండు రోజుల క్రితం ఇదే సన్నివేశం సీఎం ఇంట్లో చోటుచేసుకుంది. ఈ సమావేశం గురించి సోమవారం డీకే శివకుమార్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. "ముఖ్యమంత్రి, నేను ఒక బృందంగా రాష్ట్రం కోసం మా పని కొనసాగిస్తాం.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా మా ప్రయత్నాలు ఉన్నాయి. దానిలో భాగంగానే అల్పాహారం కోసం సీఎంను మా నివాసానికి ఆహ్వానించాను" అని వెల్లడించారు. డిప్యూటీ సీఎం ఆహ్వానం మేరకు ఈ ఉదయం ముఖ్యమంత్రి సదాశివనగర్ లోని నివాసానికి రాగా.. బెంగళూరు రూరల్ ఎంపీ డీకే సురేశ్ ఆయన్ను సాదరంగా స్వాగతించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి మార్పు గురించి ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. రెండున్నరేళ్ల తర్వాత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్కు సీఎం బాధ్యతలు అప్పగించేలా అప్పట్లో ఓ ఒప్పందం కుదిరిందని ప్రచారం జరుగుతోంది. పార్టీ దీనిని పదేపదే ఖండిస్తున్నా.. ఈ అంశం రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది. డీకేకు అనుకూలంగా నాయకత్వ మార్పులకు అధిష్ఠానం నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికార వర్గాలు తెలిపినట్లు మీడియా కథనాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకే బ్రేక్ ఫాస్ట్ మీటింగ్లు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇందులో భాగంగా శనివారం ఇద్దరు నేతలు సిద్ధూ ఇంట్లో సమావేశమయ్యారు. అక్కడ ఇరువురు నేతలు కొంతసేపు ముచ్చటించుకున్నారు. అనంతరం అల్పాహారం తీసుకున్నారు. డీకే శివకుమార్ కలిసి బ్రేక్ఫాస్ట్ చేశానని, కొంతసేపు మాట్లాడుకున్నామని సిద్ధూ వెల్లడించగా.. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక ఫలప్రదమైన చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం పేర్కొన్న సంగతి తెలిసిందే.

## మద్యం కుంభకోణం కేసు.. రెండో రోజు కస్టడీకి అనిల్ చోఖ్రా

**విజయవాడ, డిసెంబర్ 2, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో నిందితుడు (ఏ-49) అనిల్ చోఖ్రాను సిట్ అధికారులు రెండో రోజు కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించిన అధికారులు.. వివిధ అంశాలపై ఆయన్ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మూడు రోజుల కస్టడీలో భాగంగా తొలిరోజు సోమవారం కస్టడీలోకి తీసుకున్న అధికారులు 6 గంటలపాటు ప్రశ్నించారు. కీలక వివరాలు రాబట్టారు.



'వైకాపా హయాంలో అత్యధికంగా మద్యం సరఫరా ఆర్డర్లు దక్కించుకున్న అదాన్ డిస్టిలరీస్, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, లీలా డిస్టిలరీస్ సంస్థలు రాజ్ కెసిరెడ్డి(ఏ-1), ముప్పిడి అవినాష్ రెడ్డి (ఏ-7)ల నియంత్రణ, పర్యవేక్షణలో ఉండేవి. ఈ మూడు సంస్థలు కలిపి మొత్తం రూ.78 కోట్లను అనిల్ చోఖ్రాకు సంబంధించిన డొల్ల కంపెనీల ఖాతాల్లోకి మళ్లించాయి. రెండో దశలో ఆ నిధులు మరో 32 డొల్ల కంపెనీల ఖాతాల్లోకి మళ్లించారు. అక్కడి నుంచి వివిధ రూపాల్లో ఆ సొత్తు వైకాపా ముఠాకు.. వారి నుంచి అప్పటి ప్రభుత్వ పెద్దలకు చేర్చేవారు. ఎక్కడా ఆడిట్కు దొరక్కుండా, నేరం గుట్టు బయటపడకుండా బహుళ అంచెల్లో నిధుల మళ్లింపునకు పాల్పడ్డారు' అని సిట్ గుర్తించింది. ఈ నేపథ్యంలో ఆ మొత్తం మనీలాండరింగ్ గుట్టు రాబట్టేందుకు అనిల్ చోఖ్రాను ప్రశ్నిస్తోంది.

## హిల్ట్ భూముల వ్యవహారం.. భారత రాష్ట్ర సమితి పోరుబాట

**హైదరాబాద్, డిసెంబర్ 2, (రిపబ్లిక్ న్యూస్):** హిల్ట్ భూముల వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి పోరుబాటకు సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీతో కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించనుంది. పారిశ్రామిక వాడల్లో పర్యటించేందుకు 8 నిజనిర్ధారణ బృందాలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు నేతలకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.



విలువైన భూములను తక్కువ ధరకు కట్టబెడుతున్నారని భారత రాష్ట్ర సమితి ఆరోపిస్తోంది. మార్కెట్ విలువ కంటే అతి తక్కువ ధరకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. హిల్ట్ పాలసీ పేరుతో రూ.5 లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టేందుకు కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. బుధ, గురువారాల్లో పారిశ్రామికవాడల్లో పార్టీ బృందాలు పర్యటిస్తాయన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని భూములను బహుళ వినియోగ జోన్లుగా మార్చేందుకు ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్' (హిల్ట్) పాలసీని అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే.

రిపబ్లిక్ సినిమా

## అక్కడ లగ్జరీ కారులో వస్తేనే స్టార్.. :దుల్కర్ సల్మాన్




హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్ళు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. "నేను బాలీవుడ్లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉండదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. లగ్జరీకి ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం" అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్

## ఐపీఎల్ 2026 వేలంకు మ్యాక్స్‌వెల్ దూరం..!

### బేస్ ధర రూ.2 కోట్లు ఉన్న ప్లేయర్లు వీరే



అయితే, ఈసారి చాలామంది స్టార్ ఆటగాళ్లు వివిధ కారణాలతో ఈ సీజనక్కు దూరమవుతున్నారు. ఆస్ట్రేలియా ఆల్రౌండర్ గ్లెన్ మ్యాక్స్వెల్ ఈ వేలానికి తన పేరును రిజిస్ట్రేషన్ చేసుకోలేదని సమాచారం. గతేడాది పంజాబ్కు ఆడిన మ్యాక్సీ నిరాశపర్చాడు. ఏడు మ్యాచ్లో 48 పరుగులే చేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. తర్వాత గాయం కారణంగా టోర్నీకి దూరమయ్యాడు. ఇక, వెస్టిండీస్ ఆల్రౌండర్ ఆండ్రీ రస్సెల్ ఐపీఎల్కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అతడిని కేకేఆర్ 'పవర్ కోచ్'గా నియమించింది. సౌతాఫ్రికా స్టార్ ఫాఫ్ డుప్లెసిస్, ఇంగ్లాండ్ ఆల్రౌండర్ మొయిన్ అలీ ఐపీఎల్ 2026 సీజన్లో తాము ఆడట్లేదని తెలిపారు. వీరిద్దరూ పాకిస్థాన్ సూపర్ లీగ్ లో ఆడతామని ప్రకటించారు. ఈసారి వేలంలో 1,355 మంది ఆటగాళ్లలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అన్ని జట్లలో కలిపి 77 స్లాట్లు ఖాళీగా ఉన్నాయి. ఇందులో విదేశీ ప్లేయర్ల స్లాట్లు 31. కోల్కతా నైటైడర్స్ వద్ద అత్యధికంగా రూ.64.3 కోట్లు ఉండగా.. చెన్నై సూపర్ కింగ్స్ వద్ద రూ.43.4 కోట్ల పర్స్ ఉంది.

**రూ.2 కోట్ల కనీస ధర జాబితాలో ఉన్న ఆటగాళ్లు**

రవి బిష్ణోయ్, వెంకటేశ్ అయ్యర్, ముజీబుర్ రెహ్మాన్, నవీనుల్ హక్, సీన్ అబాట్, అస్టన్ అగర్, కూపర్ కూనేలి, జేక్ ఫ్రేజర్ మెల్గుర్క్, కామెరూన్ గ్రీన్, జోష్ ఇంగ్లిస్, స్టీవ్ స్మిత్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, గస్ అట్కిన్సన్, టామ్ బాంటన్, టామ్ కరన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, డాన్ లారెన్స్, లియామ్ లివింగ్టన్, టైమల్ మిల్స్, జేమీ స్మిత్, ఫిల్ అలెన్, మైకేల్ బ్రాస్వెల్, డేవాన్ కాన్వే, జాకబ్ డఫీ, మ్యాట్ హెన్రీ, కైల్ జేమీసన్, ఆడమ్ మిల్నే, డారిల్ మిచెల్, విలియం ఓరూర్క్, రచిన్ రవీంద్ర, గెరాల్డ్ కొయెట్జీ, డేవిడ్ మిల్లర్, లుంగీ ఎంగిడి, అన్రిచ్ నోకియా, రిలీ రూసో, తబ్రైజ్ షంసి, డేవిడ్ వైస్, వానిందు హసరంగ, మతీశా పతిరన, మహీశ్ తీక్షణ, జేసన్ హెూల్డర్, షైయ్ హెూప్, అకిల్ హెూసెన్, అల్జారీ జోసెఫ్. విదేశీ ఆటగాళ్లలో కామెరూన్ గ్రీన్, లివింగ్టన్ భారీ ధర పలికే అవకాశముంది. భారత ఆటగాళ్లు మయాంక్ అగర్వాల్, కేఎస్ భరత్, రాహుల్ చాహర్, ఆకాశ్ దీప్, దీపక్ హుడా, వెంకటేశ్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ మావి, నవదీప్ సైనీ, చేతన్ సకారియా, కుల్దీప్ సేన్, పృథ్వీ షా, రాహుల్ త్రిపాఠి, సందీప్ వారియర్, ఉమేశ్ యాదవ్ వేలంలో బరిలో నిలిచారు. కానీ, వీరి బేస్ ధర ఎంత అనేది ఇంకా తెలియరాలేదు.

## ఇంటి చిట్కాలు


### స్నానానికి సబ్బు బదులు ఇంట్లోనే తయారుచేసిన సున్నిపిండి వాడండి, చర్మంపై ఉన్న ట్యాన్ మొత్తం దూరమవ్వడమే కాకుండా మెరుస్తుంది కూడా

ఇప్పుడంటే సబ్బులు, బాడీ వాష్లు వచ్చాయి గానీ ఒకప్పుడు స్నానానికి సున్నిపిండి వాడేవారు. దీని గురించి చాలా తక్కువ మందికి తెలుసు. ఎలా తయారుచేయాలి, ఇలా తయారైన సున్నిపిండిని వాడితే ఏయే లాభాలున్నాయో తెలుసుకోండి.

అందాన్ని మెరుగ్గా కనిపించేలా చేయడానికి మార్కెట్లో ఎన్నో రకాల ప్రోడక్ట్స్ అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ కూడా బ్యూటీని ఎన్‌హాన్స్ చేస్తాయి. అందాన్ని మరింత పెంచుతాయని అనుకుంటారు. కానీ, ఇవన్నీ ఆర్టిఫీషియల్. పర్మినెంట్‌గా బ్యూటీని ఎన్‌హాన్స్ చేసే కొన్ని రూట్స్ ఉన్నాయి. అందులో ఒకటే సున్నిపిండి. అమ్మమ్మల కాలం నాటి ఈ సున్నిపిండితో చర్మాన్ని మెరిపించొచ్చు. మార్కెట్లో దొరికే సబ్బులు, బాడీ వాష్‌ల్లో రకరకాల కెమికల్స్ కలుస్తాయి. వాటి బదులు ఇంట్లోనే మనంతట మనమే తయారుచేసుకునే ఈ పౌడర్‌తో స్కిన్ గ్లో అమాంతం పెరుగుతుంది.




### సున్నిపిండి తయారీకి కావాల్సిన పదార్థాలు



పెసలు : 2 కప్పులు
శనగపప్పు : 1 కప్పు వీటి బదులు మీరు పిండి కూడా వాడొచ్చు.
బియ్యం : కప్పు
మైసూర్ పప్పు : 2 కప్పులు
చందనం : 1 టేబుల్ స్పూన్
పసుపు పొడి : 1 టీ స్పూన్

### తయారీ విధానం



మీరు పప్పులు తీసుకుంటే ముందుగా పప్పులన్నింటినీ దోరగా వేయించాలి. బియ్యాన్ని కూడా. వీటన్నింటిని చక్కగా పొడిలా చేయాలి. ఇందులోనే నీరు లేదా రోజ్ వాటర్ కలిపి వాడుకోవచ్చు. నానబెట్టిన సున్నిపిండిని మీరు బాడీకి రాసి స్క్రబ్‌లా రాయొచ్చు. ఇందులోనే మీరు రోజ్ పెటల్స్, ఓట్స్ పౌడర్, లికోరైస్ పౌడర్, వేప, తులసి, ఆరెంజ్ పీల్ వంటివి యాడ్ చేయొచ్చు.

### సున్నిపిండి




సున్నిపిండిని అందరూ ఒకేలా చేయరు. ఒక్కొక్కరు ఒక్కోలా చేసి తమకి ఏది సెట్ అవుతుందో దాన్నే ట్రై చేస్తారు. ఎక్కువగా శనగపిండి, బియ్యపిండి, పెసరపిండిలను వాడతారు. ఇవి చక్కని స్క్రబ్స్‌లా పనిచేస్తాయి. వీటి కారణంగా స్కిన్‌పై పేరుకుపోయిన మృతకణాలు తొలగిపోయి స్కిన్ నిగనిగలాడుతుంది. అయితే, వీటిని మనం పిండి కొనుక్కొచ్చి చేయడం కంటే నార్మల్‌గా పప్పుల్ని తీసుకొచ్చి ఎండలో ఎండబెట్టి తర్వాత మిక్సీ పట్టండి. దీనిని మీరు స్క్రబ్‌లా వాడొచ్చు.

### పసుపు, తులసి



ఇక కొంతమంది సున్నిపిండిలో పసుపు, తులసి ఆకుల్ని మిక్సీ పట్టి కలుపుతారు. ఇవి మనకి యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్‌గా పనిచేసి చర్మాన్ని ఆరోగ్యంగా చేస్తాయి. మచ్చల్ని దూరం చేసి చర్మఛాయని పెంచుతాయి. ఫంగల్ ఇన్ఫెక్షన్స్‌ని రాకుండా చేస్తాయి. వీటితో పాటు మీకు నచ్చితే కమలాఫలం తొక్కలపొడి, గులాబీ రేకులు కూడా కలపొచ్చు. వీటిలో విటమిన్ ఎ, సిలు, చర్మాన్ని ఆరోగ్యంగా, తాజాగా ఉంచుతాయి.

### వట్టివేర్లు



సున్నిపిండిలో వట్టివేరు కలిపితే చర్మంపై ఉండే ట్యాన్‌ని దూరం చేస్తాయి. కొద్దిగా పచ్చ కర్పూరం కూడా కలుపుతారు. దీని వాసన కారణంగా మనసు, బ్రెయిన్ తేలిగ్గా మారుతుంది. స్నానం చేసినప్పుడల్లా మీరు ఫ్రెష్‌గా ఫీల్ అవుతారు. వట్టివేరు పొడి కూడా చర్మ సమస్యల్ని దూరం చేయడంలో చాలా హెల్ప్ చేస్తుంది.

### నువ్వుల నూనె



సున్నిపిండిలో కాస్తా నువ్వుల నూనె వేసి ఒంటికి రాస్తే చర్మానికి రక్తప్రసరణ పెరుగుతుంది. ఈ కారణంగా హాయిగా నిద్రపడుతుంది. పైగా చర్మంపై ఉన్న జిడ్డు, మురికి అంతా కూడా దూరమవుతుంది. స్కిన్ కూడా చక్కగా మెరుస్తుంది. రెగ్యులర్‌గా వాడే సబ్బుల కంటే ఇవి చాలా మంచివి.

**గమనిక:** ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు.